క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా బాధ్యతలు


సతీష్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మండల ఈఓఆర్డీగా గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా సహస్రదీపాలంకరణ సేవ


చౌడేశ్వరిదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహామంగళహారతి పూజలు చేశారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్క్ షాప్‌ను విజయవంతం చేద్దాం

డోన్ టౌన్: నంద్యాలలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం కర్నూలు జిల్లా నాయకుడు ప్రభాకర్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, డోన్ యూనియన్ కార్యదర్శి శివరామ్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్రం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ 106(1)(2) డ్రైవర్లకు ఉరి తాడులాంటిదన్నారు. ఈ చట్టం రద్దు కోరుతూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండయ్య, రామచంద్రుడు, నారాయణ, ధనుంజయగౌడ్, మస్తాన్ పాల్గొన్నారు.

భగవంతుని నామస్మరణతో మోక్షం


మాట్లాడుతున్న నాగేంద్ర ప్రసాద్

బేతంచెర్ల: భగవంతుని నామస్మరణలో మోక్షం కలుగుతుందని వికాస భారతి సంఘం కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి తెలిపారు. గురువారం బేతంచెర్లలో గుండాగోపాల్ ఇంట్లో సామూహిక హనుమాన్ చాలిసా పారాయణం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక భావన కలిగించాలనే ఉద్దేశంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుంచే సంప్రదాయం, సంస్కారం, పెద్దలను గౌరవించడం, మంచి అలవాట్లు నేర్పాలని సూచించారు. సభ్యులు మధు మోహన్‌రెడ్డి, నాగ మోహన్, రామూర్తి పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన వడ్డె పుష్పావతిని భర్త నాగరాజు, మామ నాగమద్దయ్య, అత్త కృష్ణకుమారితో పాటు ఇద్దరు ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

బనగానపల్లె రూరల్: ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని..వీటిపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ జగన్నథ్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎన్‌ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో వివిధ పనులపై సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో పని అడిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని దినాలు కల్పించాలని, గోకుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సర పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ రేష్మ, ఈసీ మక్బుల్‌హుస్సేన్ పాల్గొన్నారు. అంతకు ముందు పాతపాడు, సాదుకొట్టం గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు.

యువకుడి మృతి

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామంలో ఈనెల 15వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు గురువారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా(29) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కోవెలకుంట్ల పోలీసులు విచారణ చేస్తున్నారు.

నీకెంత.. నాకెంత!

- నియోజకవర్గంలో తెగని వాటాల పంచాయితీ
- తెరుచుకోని మద్యం దుకాణాలు
- 21 షాపులకు 12 మాత్రమే ప్రారంభం
- కొనసాగుతున్న బేరసారాలు

కోవెలకుంట్ల: నూతన మద్యం విధానంలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యక్తులు ఈ నెల 16వ తేదీ నుంచి మద్యం దుకాణాలు ప్రారంభించాల్సి ఉంది. బనగానపల్లె నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా బనగానపల్లెలో 7, కోవెలకుంట్లలో 5, సంజామలలో 4, కొలిమిగుండ్లలో 3, అవుకులో 2 మద్యం దుకాణాలకు ఈ నెల 14వ తేదీ లాటరీ నిర్వహించారు. కోవెలకుంట్ల మండలం మినహా మిగిలిన మండలాల్లో ఒకటి, రెండు షాపులు తప్ప మిగిలిన దుకాణాలన్నీ కూటమి నేతలకే దక్కాయి. కోవెలకుంట్ల మండలంలో ఐదు షాపుల్లో ఒకటి ఓ పార్టీ నేత మద్దతుదారుడు, మిగిలిన షాపులను తటస్తులు లాటరీలో కై వసం చేసుకున్నారు. మద్యం షాపులు దక్కని కూటమి నేతలు తటస్తుల నుంచి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని ఒక షాపును రూ. 30 లక్షలు గుడ్‌విల్ ఇచ్చి టీడీపీ నేతలు సొంతం చేసుకున్నట్లు తెలిసింది. మిగిలిన రెండు షాపులను గుడ్‌విల్ లేదా షాపులో 25 శాతం వాటా ఇవ్వాలని కూటమి నేతలు పట్టుబట్టినట్లు సమచారం. దీంతో మండలంలో ఇప్పటి వరకు కేవలం రెండు షాపులు మాత్రమే తెరుచుకున్నాయి. బనగానపల్లె మండలంలో నాలుగు షాపులు, కొలిమిగుండ్ల మండలంలో 2, అవుకు మండలంలో ఒకటి, సంజామల మండలంలో 3 షాపులు చొప్పున నియోజకవర్గంలో 12 షాపులు ప్రారంభమయ్యాయి. మిగిలిన తొమ్మిది షాపులు తెరుచుకోలేదు. బేరసారాలు, వాటాలు, తదితర బెదిరింపుల పర్వం కారణంగా షాపులు తెరుచుకోలేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మిగిలిన షాపుల ప్రారంభానికి ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


కోవెలకుంట్లలో మద్యం కోసం ఎగబడిన మద్యం ప్రియులు

దోచుకునేందుకు సిద్ధం

- సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయించుకునేందుకు నిర్ణయం

డోన్: నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి తక్కువ ధరకే మద్యం విక్రయిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహిస్తోంది. మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించి పాత ధరలకే విక్రయిస్తుండడంపై మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 180 ఎంఎల్ మద్యాన్ని రూ.99కే అందిస్తామని మందుబాబులను మభ్యపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులపై మద్యం ప్రియులు దుమ్మెత్తిపోస్తున్నారు. అధిక ధరలను చూసి నిరాశ చెందుతున్నారు. డోన్ నియోజకవర్గంలో 16 దుకాణాల్లో 8 షాపులు ఎమ్మెల్యే కోట్ల వర్గీయులు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ వర్గీయులు 2, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి వర్గీయులు 2, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయులు 3, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల వర్గానికి ఒక్క దుకాణం లాటరీ ద్వారా లభించడంతో గురువారం పూజలు నిర్వహించి మద్యం విక్రయాలను ప్రారంభించారు. నియోజకవర్గంలో అన్నీ దుకాణాలను టీడీపీ నేతలే కైవసం చేసుకోవడంతో వారికి అడ్డూఅదుపు లేకుండాపోయింది. మరో రెండు రోజుల్లో వీరంతా సిండికేట్‌గా ఏర్పడి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు తమ ఆదాయానికి గండి పడకుండా ఎక్సైజ్, పోలీసులతో పాటు దుకాణ యజమానులతో సంప్రదింపులు జరిపి మద్యం అక్రమ విక్రయాలను అరికట్టేందుకు కొంత మందిని పైలెట్లుగా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నాటుసారా, అక్రమ మద్యం నియంత్రణ పేరుతో సిండికేట్ పైలెట్లు గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అరాచకాలు, దాడులను తలుచుకుని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.


కంబాలపాడు రహదారిలో మద్యం కొనుగోలుకు ఎగబడిన జనం

నేటి నుంచి శిక్షణ తరగతులు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలకు చెందిన ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

- సంజామల: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ తెలిపారు.

22 నుంచి ఆధార్ క్యాంప్‌లు

సంజామల: మండలంలోని పలు సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఉచిత ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సాల్మాన్ గురువారం తెలిపారు. ఈ నెల 22న ఆర్.లింగందిన్నె, 23న గిద్దలూరు, 24 ఆకుమల్ల, 25న ముక్కమల్ల సచివాలయాల్లో క్యాంప్‌లు ఉంటాయని వెల్లడించారు. ప్రజలు ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం స్వాధీనం

బనగానపల్లె: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామంలో తలారి అక్కమ్మ మద్యం విక్రయిస్తుండగా గురవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆమె వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అవుకు: మాతాశిశుసంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు నజ్రిన్, సుజాత, శివ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె, చెర్లోపల్లె, అవుకు–3 గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే ఎన్సీపీ కార్డులో వివరాలు నమోదు చేసి, ఆర్సీహెచ్‌లో తప్పకుండా అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిశుభ్రత, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓహెచ్ఎస్ మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు వేణుగోపాలరాజు, వరలక్ష్మి, దానమ్మ, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హైవే పెట్రోలింగ్ వాహనం ప్రారంభం


జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

డోన్ టౌన్: అత్యాధునిక సోలార్ సిస్టంతో పనిచేసే సైరన్ బల్బులతో కూడిన హైవే పెట్రోలింగ్ వాహనాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి డీఎస్పీ శ్రీనివాసులతో కలిసి గురువారం ప్రారంభించారు. స్థానిక జెడ్పీ అతిథి గృహం వద్ద ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహం వద్ద వాహనానికి పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా డోన్‌లో సోలార్ ప్యానల్‌తో పనిచేసే సైరన్ బల్బుల హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ వాహనం ప్యాపిలి పోలీస్‌స్టేషన్ సరిహద్దు నుంచి కర్నూలు రోడ్డులోని టోల్ ప్లాజా వరకు నిరంతరం గస్తీ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, రవీంద్రనాథ్‌కుమార్, మమత పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాల తనిఖీ


వసతులపై ఆరా తీస్తున్న జడ్జి అబ్దుల్‌రహిమాన్

బనగానపల్లె రూరల్: హైకోర్టు ఆదేశాల మేరకు బనగానపల్లె పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహం, కళాశాల వసతి గృహాన్ని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి అబ్దుల్ రహిమాన్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలపై వార్డన్లు, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట వార్డన్ విద్యావతి, మండల లీగల్ సెల్ న్యాయవాదులు నరసింహారెడ్డి, అల్లావుద్దీన్, విక్రమ్, ముజాహీర్ ఉన్నారు.

మిద్దె కూలి వృద్ధురాలికి గాయాలు


అవుకులో కూలిన మట్టిమిద్దె

అవుకు: పట్టణంలోని బుగ్గగారి వీధిలో మట్టిమిద్దె కూలి వృద్ధురాలు గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సూరిశెట్టి మద్దిలేటమ్మ తన కుమార్తె, మనవడు, అతని భార్యతో కలిసి అవుకు పట్టణంలోని బుగ్గగారి వీధిలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి అందరూ ఇంట్లో నిద్రిస్తున్నారు. మద్దిలేటమ్మ మరుగుదొడ్డి కోసం గది నుంచి బయటకు వచ్చి వరండాలోనే నిద్రపోయింది. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఒక్కసారిగా మట్టిమిద్దె (వరండా) కూలింది. దీంతో వృద్ధురాలి తలకు, కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సువర్ణాదేవి కూలిన మట్టిమిద్దెను పరిశీలించి వివరాలను సేకరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడుబడిన ఇళ్లలో ఉండొద్దని సూచించారు.


పరిశీలిస్తున్న తహసీల్దార్ సువర్ణాదేవి

వీడని వర్షం.. పంటకు నష్టం

- ఆందోళనలో అన్నదాత

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం దొర్నిపాడు మండలంలో అత్యధికంగా 46.8 మి.మీ, కోవెలకుంట్లలో 31.2 మి.మీ, సంజామలలో 25.8 మి.మీ, అవుకు మండలంలో 25.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వివిధ పంటలకు నష్టం చేకూరడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మొక్కజొన్న, జొన్న, పొగాకు పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.

ఈ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా పప్పుశనగ, జొన్న పంటలు విస్తారంగా సాగు కావాల్సి ఉంది. భారీ వర్షాల కారణంగా విత్తనం వేసేందుకు అవకాశం లేకపోవడంతో అదును దాటుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


భీమునిపాడు వద్ద మిరపలో నిలిచిన వర్షపు నీరు

సంజామలలో 28.8 మి.మీ వర్షపాతం

సంజామల: మండలంలో గురువారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగాయి. వాగులు వంకలు పొర్లిపొరుతున్నాయి. సంజామల మండలంలో 28.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సంజామల, కమలపురి, బొందలదిన్నె, ముచ్చలపురి గ్రామాల్లో వరి నీట మునిగింది. వర్షాలు ఇలానే కొనసాగితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కోవెలకుంట్లలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు


సంజామలలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


బొందలదిన్నెలో నీట మునిగిన వరి

పేకాట క్లబ్‌లపై నిఘా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల నుంచి కోవెలకుంట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో రూ. లక్షల్లో పేకాట కొనసాగుతోంది. వివిధ ప్రాంతాలకు చెందిన పేకాటరాయుళ్లు ఇక్కడికి వచ్చి పేకాట ఆడుతున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయానికి సమాచారం అందింది. రెండు రోజుల నుంచి స్పెషల్ పార్టీ పోలీసులు పేకాట క్లబ్‌లపై నిఘా ఉంచినట్లు తెలిసింది. మఫ్టీలో ఆయా క్లబ్‌లపై దాడి చేయగా అంతకముందే సమాచారం తెలుసుకున్న పేకాట రాయుళ్లు అక్కడి నుంచి జారుకోవడంతో స్పెషల్ పార్టీ పోలీసులు వెనుదిరిగారు.

అధిక ఎరువులతో అనర్థాలు

డోన్ రూరల్: పంట సాగులో రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతినే ప్రమాదం ఉందని.. ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని వినూత్న ఆగ్రోటెక్ మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.మహబూబ్‌బాషా తెలిపారు. మండల పరిధిలోని సీసంగుంతల గ్రామంలో గురువారం రైతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన ఎరువులతో భూసారాం తగ్గి దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు ఉత్తమమని పేర్కొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్యాపిలి: జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో నాటుసారా స్థావరాలపై గురువారం జలదుర్గం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో రెండు డ్రమ్ముల్లో నిల్వ ఉన్న 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని బోయవాండ్లపల్లికి చెందిన కేశన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం కావాలి

డోన్ టౌన్: ప్రజలు ఆర్టీసీపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు సిబ్బంది కృషి చేయాలని సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ శశిభూషణ్ అధ్యక్షతన డ్రైవర్లు, కండక్టర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలా నడుచుకోవాలనే అంశాలపై వివరించారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం సెప్టెంబర్ నెలకు ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన కండక్టర్లు సుదర్శనరావు, రమణారెడ్డి, మౌలాలి, డ్రైవర్లు డీఎస్ రెడ్డి, సాహెబ్, వైఎంఎస్ రెడ్డిలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ,


బేతంచెర్ల: సిమెంట్ నగర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె రూరల్: మండలంలోని కై ప, అప్పలాపురం గ్రామాల్లో రూ.2.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళికి మహిళలకు ఉచిత సిలిండర్లను పంపిణీ చేస్తామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈఈ నాగశ్రీనివాసులు, ఎంపీడీఓ బీవీ వెంకటరమణ, పీఆర్ ఏఈ రమణ పాల్గొన్నారు.

- బేతంచెర్ల: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ నగర్, కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా సర్పంచ్‌లు ఏస్తేరమ్మ, చిన్న మద్దమ్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, పంచాయతీరాజ్ ఇంజినీర్ మహేష్ పాల్గొన్నారు.
- సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని, ముక్కమల్ల, ముచ్చలపురి, కొత్తపేట గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ సాల్మాన్ గురువారం భూమి పూజ చేశారు. ఈఓఆర్డీ రాధికా రెడ్డి, ఏఓ విజయకుమార్ రెడ్డి, ఏపీఓ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


బేతంచెర్లలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాల్మీకి నాయకులు


బనగానపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు


డోన్: వాల్మీకి సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న వాల్మీకులు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్లలో వాల్మీకి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎంపీ సుబ్బయ్య వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గాంధీసెంటర్ నుంచి పంచాయతీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

డోన్/ డోన్ టౌన్: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని డోన్ వాల్మీకి సర్కిల్‌లోని విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యదర్శులు శీలం భాస్కర్‌నాయుడు, వలసల రామక్రిష్ణ, నాయకులు శ్రీరాములు, క్రిష్ణమూర్తి, పూల శ్రీను, రామయ్య, కేశవయ్య, గోవిందు పాల్గొన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వాల్మీకులతో కలిసి తన కార్యాలయంలో నివాళులర్పించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. ఉపాధ్యాయులు రాధా, భానుప్రకాష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు హరినాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పించారు. అలాగే యనకండ్ల గ్రామం, బోయపేటల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ర్యాలీగా బస్టాండ్ వరకు వెళ్లి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, నాగరాజు, సురేష్, నవీన్, శ్రీహరి పాల్గొన్నారు.
- ప్యాపిలి: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని వాల్మీకి విగ్రహ ఏర్పాటు స్థలం వద్ద వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలరంగయ్య, శ్రీనివాసులు, బంగినాగరాజు, వెంకటేశ్, జక్కలచెరువు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.
- కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వాల్మీకుల ఐక్యపోరాట సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం మేళతాళాల మధ్య గ్రామోత్సం నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు ఉలవల నరసింహుడు, ప్రసాద్, వెంకటేష్, నాగకుళ్లాయి, శ్రీను, రామకృష్ణ, చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.
- సంజామల: ఆకుమల్ల గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మహర్షి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.
- బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని వాల్మీకి ఆలయంలో సంఘం నాయకులు రాముడు, బ్రహ్మనాయుడు, ఆకుల రమణ, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, మనోహర్, మల్లీ, నిరంజన్, రవి పూజలు చేశారు. గూటుపల్లెలో వాల్మీకి విగ్రహానికి సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి పూలమాలలు వేశారు.


అవుకు: సుంకేసులలో బహుమతులను ప్రదానం చేస్తున్న సంఘం నాయకులు

- అవుకు: సుంకేసుల గ్రామంలో నంద్యాల జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, ట్రెజరర్ డీకయ్య, జాయింట్ సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. వాల్మీకి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.